క్లుప్తంగా

దివ్యాంగులకు వైద్యపరీక్షలు



చికిత్సలు చేస్తున్న ఏరియా ఆస్పత్రి వైద్యులు

నగరి : స్థానిక దివ్యాంగుల పాఠశాలలోని విద్యార్థులకు ఏరియా ఆస్పత్రి వైద్యులు పాఠశాలలో వైద్య పరీక్షలు నిర్వహించారు. బుధవారం పాఠశాలకు వెళ్లిన వారు అక్కడున్న దివ్యాంగులకు అవసరమైన పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. జూనియర్ సివిల్ జడ్జి విష్ణువర్మ ప్రత్యేకంగా ఈ శిబిరాన్ని పర్యవేక్షించారు. దివ్యాంగులకు ఏ సమస్య లేకుండా చూసుకోవాలని పాఠశాల నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి వైద్యులు, పాఠశాల నిర్వాహకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి



ఆధార్ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ

వడమాలపేట (విజయపురం) : వడమాలపేట మండలం పత్తిపుత్తూరు సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని ఎంపీడీఓ శేషగిరిరావు తనిఖీ చేశారు. ఆధార్ కేంద్రానికి వచ్చే దరఖాస్తుదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. అలాగే 28, 29 తేదీల్లో అప్పాయిగుంట సచివాలయంలో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

పాలసముద్రం : మండల పరిధిలోని గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రవీణ్ తెలిపారు. బుధవారం పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఆయన సందర్శించారు. గర్భిణులు, చిన్నారులకు వేస్తున్న టీకాల రిజిస్టర్‌ను పరిశీలించారు. చిన్నారులకు టీకాలు క్రమం తప్పకుండా వేయాలన్నారు. అప్పుడే చిన్నారులకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ప్రసవాలు ప్రభుత్వ ఆస్పత్రిలో జరిగితే మాతా శిశు మరణాలు జరగవన్నారు. గర్భిణులు ప్రసవం వరకు వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. అనంతరం గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్ మురళి, సుశీల, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



ర్యాలీ చేస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ

నింద్ర: ప్రపంచ టాయిలెట్ వారోత్సవాలను పురస్కరించుకొని బుధవారం మండలంలోని ఎంఎస్‌వీఎం పురంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎంపీపీ దీప హాజరై మాట్లాడుతూ.. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం వలన వ్యాధుల నుంచి దూరంగా ఉండవచ్చన్నారు. ప్రజలు స్వచ్ఛత వైపు అడుగులు వేయాలన్నారు. దీంతో గ్రామాలు, ప్రజలు అనారోగ్యం లేని మండలంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివ ప్రసాద్ వర్మ, పంచాయతీ విస్తరణ అధికారి లక్ష్మీపతి, సర్పంచ్ సుబ్రహ్మణ్యంరాజు, స్వచ్ఛభారత్ మండల కోర్డినేటర్ అరుణాచలం , పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం

నగరి : ప్రతి బుధవారం ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం వచ్చే గర్భిణులకు మాజీ మంత్రి ఆర్కేరోజా తన చారిటబుల్ ట్రస్టు ద్వారా అవిశ్రాంత సేవ అందిస్తూనే ఉన్నారు. ఆరేళ్ల పాటుగా ఈ సేవలు కొనసాగిస్తూ గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తూనే ఉన్నారు. అధికారం ఉన్నా లేకున్నా తన సేవలను ఆమె కొనసాగిస్తూనే ఉన్నారు. గర్భిణులకు అన్నదానం అన్నది రాజకీయ లబ్ధి కోసం చేసేది కాదని ఆమె నిరూపిస్తున్నారు.

మట్టి నమూనా పరీక్షలు తప్పనిసరి

కార్వేటినగరం : పంట సాగుకు మట్టి నమూనా పరీక్షలు తప్పనిసరని మండల వ్యవసాయ అధికారిణి హేమలత అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఆళత్తూరు, కత్తెరపల్లి, పొన్నగల్లు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. పంట సాగుకు మట్టి నమూనా పరీక్షలు నిర్వహించి అందుకు అనుగుణమైన పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. పంట సాగులో కలుపు మొక్కల నివారణ మెళకువలను పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. అలాగే ప్రతి రైతు పంట ఆధారిత బీమాను సద్వినియోగం చేసుకుని పంట నష్టం వాటిల్లినప్పుడు బీమా ద్వారా లబ్ధి పొందవచ్చని పేర్కొన్నారు. అనంతరం రైతులు తీసుకొచ్చిన మట్టి నమూనాలను పరిశీలించారు.

ఎన్నికల ముందు రైతు పక్షపాతి అని డప్పు కొట్టుకున్న కూటమి అధికారంలోకి రాగానే రైతులకు మొండిచేయి చూపింది. అన్నదాతలకు ఇచ్చిన హామీలు నెరవేర్చక పోగా ఉచిత పంటల బీమాకు మంగళం పాడేసింది. వైఎస్సార్‌సీపీ హయాంలో రైతులపై పైసా భారం పడకుండా వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసింది. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకుంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ పథకంపై చేతులెత్తేసింది. రైతులే బీమా ప్రీమియం చెల్లించాలంటూ నిబంధన పెట్టింది. ఖరీఫ్ సీజన్ ముగిసినా అన్నదాత సుఖీభవ పథకం ఊసెత్తకపోవడంపై కూటమి ప్రభుత్వంపై అన్నదాతలు మండిపడుతున్నారు.



తుపానుతో దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు (ఫైల్)

ఉచిత బీమా ఉత్తిదే!

- ఇన్సూరెన్స్‌పై చేతులెత్తేసిన కూటమి సర్కారు
- అన్నదాతలకు అండగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- రైతులు ప్రీమియం చెల్లిస్తేనే ప్రస్తుతం బీమా వర్తింపు

పాలసముద్రం : తుపాను, భారీ వర్షాలు, వరదలతో పంట నష్టం జరిగినప్పుడు పరిహారం పొందడానికి పంటల బీమా పథకం ఎంతో దోహదపడుతుంది. పంట విలువ అంచనా వేసి బీమా కంపెనీలు రైతులకు నష్ట పరిహారం అందిస్తాయి. రైతులు పంటలపై బ్యాంకు రుణాలు తీసుకుంటే బ్యాంకు అధికారులే బీమా ప్రీమియం చెల్లిస్తారు. పంటల బీమా సకాలంలో చెల్లించకపోతే విపత్తు సమయంలో పంట నష్టపోయినా నష్ట పరిహారం అందక నష్టపోతారు.



వర్షాలతో దెబ్బతిన్న వరిపంట (ఫైల్)

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

రైతులపై ప్రీమియం భారం పడకుండా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 2019 ఖరీఫ్ సీజన్ నుంచి ఉచిత పంటలు బీమా పథకాన్ని అమలు చేసింది. ఈ క్రాప్ చేసుకున్న రైతులందరికీ ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించి ఆదుకుంది. దీని వల్ల రైతులకు బీమా ప్రీమియం చెల్లించే పని లేకుండా చేసింది. విపత్తుల సమయంలో పంట నష్టపోయిన రైతులతో పాటు కౌలు రైతులకు పూర్తి స్థాయిలో పరిహారం అందేది. గత ప్రభుత్వం మండల పరిధిలో పంట నష్టపోయిన సుమారు13,885 మంది రైతులకు సకాలంలో రూ 9.12 కోట్ల పరిహారం వారి ఖాతాలకు వేసి ఆదుకుంది.

పంట పేరు	చెల్లించాల్సిన ప్రీమియం ఎకరాకు(రూ.లలో)
వరి	630
మినుము	285
పెసర	270
నువ్వులు	180
వేరుశనగ	480
పొద్దుతిరుగుడు	300
టమాట	1500
జొన్న	297

డిసెంబర్ 15లోపు ప్రీమియం చెల్లించాలి

మండల పరిధిలో రబీ సీజన్‌లో సుమారు 5,600 ఎకరాల్లో వేరుశనగ, చెరకు, వరి, సాగు చేశారు. బీమా ప్రీమియం చెల్లించడానికి ప్రభుత్వం డిసెంబర్ 15 వరకు గడువు విధించింది. ఈ క్రాప్ చేయించుకున్న రైతులు పంటలకు ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనలో వేరుశనగ, వరి, పప్పు, జొన్న, ఉల్లి పంటలను చేర్చింది.

రైతులపై భారం మోపడం తగదు



పంటల బీమాకు సంబంధించిన ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలి. గతంలో అమలు చేసిన ఉచిత బీమా పథకాన్ని కొనసాగించాలి. కూటమి ప్రభుత్వం రైతులపై భారం మోపడం సమంజసం కాదు. పెట్టుబడికే డబ్బులు లేక ఇబ్బందులు పడుతుంటే బీమా ప్రీమియం చెల్లించాలనడం అన్యాయం. రైతులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అన్నదాత సుఖీభవ పథకం, పెట్టుబడి సాయం అందజేయాలి.

– ధనుంజయ్, సీఎం కండ్రిగ

ఉచిత బీమా రద్దు అన్యాయం



ఉచిత పంటల బీమా రద్దు చేయడం అన్యాయం. కూటమి ప్రభుత్వం వచ్చీ రాగానే రైతులను దెబ్బతీస్తోంది. రబీ సాగు చేసిన పంటలకు ఉచిత పంటల బీమాను వర్తింపజేయాలి. ప్రకృతి వైపరీత్యాల వలన పంటలు దెబ్బ తింటే ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వడానికి ఉండదు. ప్రస్తుత ప్రభుత్వ నుంచి ఎలాంటి సాయం అందడం లేదు. బీమా ప్రీమియం చెల్లించాలంటే భారంగా ఉంది. ఇప్ప టికే అప్పులు చేసి రబీ సీజన్‌లో పంటలు సాగు చేస్తున్నాం.

– శేఖర్‌రాజు, తొట్టికండ్రిగ, రైతు

రైతులే ప్రీమియం చెల్లించాలి



ఉచిత పంట బీమా వర్తించాలంటే ప్రీమియం రైతులే చెల్లించాలి. ఈ మేరకు ప్రభుత్వం వెలువరించిన ఉత్తర్వులపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఈ ప్రక్రియ రైతులకు అలవాటైతే క్రమం తప్పకుండా చెల్లిస్తారు. తద్వారా ప్రకృతి విపత్తుల సమయంలో పంటలు దెబ్బతిన్నా పరిహారం పొందే వీలుంటుంది. నిర్దేశించిన గడువులోగా ప్రతి రైతూ ప్రీమియం చెల్లిస్తే బీమా వర్తిస్తుంది,

– ఢిల్లీ ప్రసాద్, వ్యవసాయాధికారి

ఆధార్‌కు ఎన్‌పీసీఐ అనుసంధానం చేసుకోండి

పుత్తూరు : మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి ఒక్కరూ తమ ఆధార్‌కు నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ)ను అనుసంధానం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ మంజునాథ్‌గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి పొందేందుకు ఎన్‌పీసీఐతో పాటు హౌస్ హోల్డ్ జియో ట్యాగ్ విధిగా చేసుకోవాలని స్పష్టం చేశారు. ఇందుకు ఈనెల 30 తేదీ లోపు ఆయా సచివాలయాల్లో అనుసంధానం చేసుకోవాలని కోరారు.

ఐటీఐ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ



అవగాహన కల్పిస్తున్న వెంకమరాజు

విజయపురం : ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ విద్యార్థులకు సబ్జెక్టు నైపుణ్యాలపై రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వెంకమరాజు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశ్రామిక రంగంలో చదువుతో పాటు నైపుణ్యం కలిగిన విద్యార్థులకు మంచి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇప్పటి వరకు సరైన గైడెన్స్ లేకపోవడంతో చాలా మంది అభ్యర్థులు నిరుద్యోగులుగా ఉన్నారని గుర్తు చేశారు. ఐటీఐలో థియరీ అంశాలతో పాటు ప్రాక్టికల్ నాలెడ్జ్ చాలా అవసరమన్నారు. ప్రాక్టికల్ నాలెడ్జ్ ఉన్న వారు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని తెలిపారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ లలితకుమారి పాల్గొన్నారు.

పంటల బీమా ప్రీమియం చెల్లించండి

వడమాలపేట (విజయపురం) : వడమాలపేట మండల రైతులు సకాలంలో పంటల బీమా ప్రీమియం చెల్లించాలని ఏఓ విజయకుమార్ పేర్కొన్నారు. బుధవారం రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో పంటల బీమా పథకంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2024–25 రబీలో రైతులు, స్వచ్ఛందంగా పంటల బీమా నమోదు చేసుకోవాలన్నారు.

ఆర్టీఐతో పారదర్శక సమాచారం



ఎంపీడీఓ కార్యాలయం వద్ద నాయకుల సంబరాలు

గంగాధర నెల్లూరు : ఆర్టీఐ చట్టం అమల్లోకి రావడం వల్లే ప్రభుత్వ కార్యాలయాల వివరాలు సులభంగా లభ్యమవుతున్నాయని మండల పరిషత్ సూపరింటెండెంట్ లోకేష్, ఎంఈఓ గుణశేఖర్ రెడ్డి సంయుక్తంగా పేర్కొన్నారు. జీడీ నెల్లూరు ఆర్టీఐ యూనియన్ ఏర్పాటు చేసి నాలుగేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా జీడీ నెల్లురు ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో ఆర్టీఐ యూనియన్ నాయకులు, అధికారులు కలిసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆర్టీఐ యూనియన్ అధ్యక్షుడు పట్టాభిరెడ్డి మాట్లాడుతూ.. మారుమూల గ్రామాల్లో సమాచార చట్టం గురించి ప్రజలకు అవగాహన కల్పించి వారిలో చైతన్యం తీసుకురావడమే యూనియన్ ప్రధాన ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో సమాచారహక్కు చట్టం జాతీయ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ డి.కె.కుమార్, ఆర్టీఐ ఉపాధ్యక్షుడు మోహన్ కుమార్ , విద్యుత్ ఏఈ వరదరాజులు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు నేరం



ఎస్‌బీఆర్‌పురం ఉన్నత పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు

వడమాలపేట (విజయపురం) : బాల్య వివాహాలు చేసిన.. సహకరించినా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని ప్రధానోపాధ్యాయుడు బాల సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. బుధవారం ఎస్‌బీఆర్ పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్యవివాహాల కారణంగా బాలికల విద్య, రక్షణ, ఆరోగ్యంతో పాటు వారి అభివృద్ధి వెనుకబడుతుందన్నారు. బాల్యవివాహాలను దూరం చేయాలంటే అమ్మాయిలు ఉన్నత విద్యను అభ్యసించాలని, బాలికలకు విద్యయే విలువైన ఆభరణమని, ప్రతి ఒక్కరూ చదువుకున్నప్పుడే సమాజంలో గుర్తింపు, గౌరవం ఉంటుందన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో బాల్య వివాహాలు జరగకుండా అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బాల్యవివాహ రహిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు జయలక్ష్మి, సుజాతమ్మ, లక్ష్మిదేవి , సహాయకులు, విమల, విజయలక్ష్మి, ప్రమీల, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దగా ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి

– ఇన్‌చార్జి కృపాలక్ష్మి ఆగ్రహం



వెదురుకుప్పం : హామీలను అమలు చేయమని అడిగితే వేధింపులు, వంచనలు, అరెస్టులతో టీడీపీ నేతలు పేట్రేగిపోతున్నారని గంగాధర నెల్లూరు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కళత్తూరు కృపాలక్ష్మి ధ్వజమెత్తారు. పేద ప్రజలను వంచించిన దగా ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. గురువారం జ్యోతిరావు పూలే వర్ధంతి నేపథ్యంలో ముందుగా బుధవారం సాయంత్రం ‘సాక్షి’తో మాట్లాడుతూ.. జ్యోతిరావు పూలే సామాజిక సంస్కరణ ఉద్యమంలో ముఖ్యమైన పాత్ర పోషించారని బడుగు బలహీన వర్గాలకు విద్యను అందించే ప్రయత్నంలో ఎన్నో పోరాటాలు చేశారని కొనియాడారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేసి అరాచకాలకు నాంది పలుకుతున్నారని కళత్తూరు కృపాలక్ష్మి మండిపడ్డారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించి మహిళలకు రక్షణ కొరవడిందని విమర్శించారు.

బాల సురక్ష విద్యార్థులకు వరం



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ దుర్గాదేవి

గంగాధర నెల్లూరు : బాల సురక్ష కార్యక్రమం ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు వరమని డాక్టర్ దుర్గాదేవి అన్నారు. గంగాధర నెల్లూరు జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమంలో భాగంగా బుధవారం 186 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ దుర్గాదేవి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు ఆరోగ్యం ముఖ్యమని సూచించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తగా ఉండాలని కోరారు. జ్వరం వస్తే ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి వైద్య పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పీ సంధ్య, యూనిస్, ఏఎన్‌ఎం భారతి, మమత, ఆశా వర్కర్‌లు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే జైలు



సదస్సుకు హాజరైన విద్యార్థులు



మాట్లాడుతున్న సీఐ సురేంద్రనాయుడు

పుత్తూరు : ర్యాగింగ్, సైబర్ నేరాలకు పాల్పడితే జైలుశిక్ష తప్పదని సీఐ సురేంద్రనాయుడు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సామాజిక మాధ్యమం- దుర్వినియోగం, సైబర్ నేరాలు–విద్యార్థులపై ప్రభావం అనే అంశాలపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ర్యాగింగ్ వంటి వికృత చేష్టలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. అమ్మాయిలను దూషించడం, యాసిడ్ దాడులు వంటి వికృత చేష్టలతో జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. సామాజిక మాధ్యమాల్లో మన ఫొటోలను అప్‌లోడ్ చేయరాదని ప్రత్యేకించి విద్యార్థినులు ఈ విషయాన్ని గుర్తుపెట్టుకోవాలన్నారు. అలా చేస్తే ఫొటోలు మార్ఫింగ్ చేసి బ్లాక్‌మెయిల్ చేసే అవకాశం ఉందన్నారు. మన ఫోన్లకు వచ్చే అనుమానాస్పద లింకులను ఓపెన్ చేయకూడదని తెలిపారు. భవిష్యత్తును నాశనం చేసే ర్యాగింగ్‌తో పాటు మత్తు పదార్థాల జోలికి వెళ్లరాదని సూచించారు. ఇలాంటి నేర ప్రవృత్తికి విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. లేకుంటే జీవితం జైలుపాలు కాకతప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రమౌళి, బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ హరిత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పిచ్చిగుంట్ల కుటుంబాలను ఆదుకుంటాం

గంగాధర నెల్లూరు : నియోజకవర్గ కేంద్రంలోని గంగాధర్ నెల్లూరు పంచాయతీలో పందులను పోషిస్తూ జీవనం సాగిస్తున్న పిచ్చిగుంట్ల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని ఎంపీడీవో హరిప్రసాద్ రెడ్డి తెలిపారు. సీడ్ సర్వే చేస్తుండగా బుధవారం జీడీ నెల్లూరు పంచాయతీలోని పిచ్చిగుంట్ల కుటుంబాలు నివాసం ఉంటున్న ప్రాంతాన్ని ఎంపీడీవో హరి ప్రసాద్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా పందులు మేపుకుంటూ జీవనం సాగిస్తున్న వారితో మాట్లాడుతూ.. ప్రభుత్వం ద్వారా రుణ సహాయం , మౌలిక సదుపాయాలు కల్పించి అన్ని విధాలు ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ మేరకు సమాచారాన్ని ఫోన్‌లో బీసీ కార్పొరేషన్ ఈడీకి వివరించగా ఆ కుటుంబాలను ఆదుకుంటామని ఈడీ తెలియజేశారని ఎంపీడీఓ పేర్కొన్నారు.


గోకులం షెడ్ల మంజూరుపై నిలదీత



పశువైద్యాధికారిని నిలదీస్తున్న సర్పంచ్ వెంకటేష్, వైస్ ఎంపీపీ కోదండన్

పెనుమూరు (కార్వేటినగరం) : ప్రజా సమస్యల పరిష్కారానికి అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని ఎంపీపీ మహాసముద్రం హేమలతారెడ్డి కోరారు. బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ అన్ని శాఖల అధికారులతో సమీక్షించారు. అనంతరం గోకులం షెడ్లు స్థానిక ప్రజా ప్రతినిధులకు తెలియకుండా టీడీపీ నేతలు, ఆ పార్టీ సానుభూతిపరులకు అధికారులు మంజూరు చేస్తున్నారని రామకృష్ణాపురం సర్పంచ్ వెంకటేష్, వైస్ ఎంపీపీ కోదండన్ పశువైద్యాధికారి సుబ్రహ్మణ్యంను నిలదీశారు. దీంతో ఎంపీడీఓ నీలకంఠేశ్వర రెడ్డి స్పందిస్తూ.. అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని ఇప్పటి వరకు ఎవరికీ గోకులం షెడ్లు మంజూరు చేయలేదని వివరణ ఇచ్చారు. పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని స్పష్టం చేశారు. విద్యుత్ ఏఈ తులసీ ప్రసాద్ మాట్లాడుతూ.. వినియోగదారులు సోలార్ విద్యుత్ కనెక్షన్లు పొందేందుకు పెనుమూరును పైలట్ ప్రాజెక్టు కింద ప్రభుత్వం ఎంపిక చేయడం జరిగిందని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు దొరస్వామియాదవ్, తహసీల్దార్ శ్రావణకుమార్, ఏపీఓ గుణశేఖర్, ఎంఈఓలు రాజేంద్రన్, భాస్కర్ నాయుడు, ఈఓపీఆర్డీ ఉమామహేశ్వర్, వ్యవసాయ శాఖ అధికారిణి సుహర్‌లత, వెలుగు ఏపీఎం చిరంజీవి పాల్గొన్నారు.

నీహార నగరి





నగరి పట్టణంలో బుధవారం నీహారము ఉదయం 6 గంటలకు రహదారులు కనిపించకుండా కప్పేసింది. వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో మంచు దుప్పటిలో పట్టణం ఒదిగిపోయింది. ఎక్కడ చూసినా రోడ్లు పొగ మంచుతో దర్శనమిచ్చాయి. మంచులో అటువైపున్న నివాసాలు, చెట్లు, వాహనాలు సైతం కనిపించని పరిస్థితి నెలకొంది.

- నగరి